# విషం

"ఈ రోజు నీ పని ఖతం. నిన్ను చంపకపోతే మమ్మల్ని బతకనిచ్చేలా లేవు" ఎదురింటి నుండి ఖాసిం చాచా గొంతు పెద్దగా విన్పించింది.

కుల్సుం ఖాలా గుర్తొచ్చి, తింటున్న చపాతీని సగంలోనే వదిలేసి బైటికొచ్చాను.

ఖాసిం చాచాకు దాదాపు అరవైయేళ్ళుంటాయి. కాయకష్టం చేసిన శరీరం. ఇప్పటికీ మనిషి బలంగా ఉంటాడు. కుల్సుం ఖాలానే సన్నగా, పూచిక పుల్లలా ఉంటుంది. రోజుకొక్కసారైనా పోట్లాడకపోతే ఖాసించాచాకు నిద్ర పట్టదు. కన్న కొడుకులు నలుగురూ పెళ్ళిళ్ళు చేసుకుని ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. ఈ ముసలాళ్ళ అతీ గతీ పట్టించుకోరు. దీనికంతా బాధ్యత కుల్సుం ఖాలాదే అన్నట్లు మాట్లాడతాడు. 'దుర్మార్గుల్ని, బేరహం నా కొడుకుల్ని కని నా ఎదాన పడేసింది ఛినాల్' అంటూ పెద్దపెద్దగా అరిచి, బూతులు తిట్టి, ఫెడీ ఫెడీమని నాలుగు గుద్దులు గుద్దితేగాని తిన్నదరగదు. ఈ దెబ్బలకే ఏదోరోజు ఖాలా చచ్చిపూర్కుంటుందని నా భయం.

"బైటికెళ్ళనిస్తాననుకున్నావా? నిన్ను ఖైమా చేస్తేగాని నాకు మనశ్శాంతి ఉండదు" దుడ్డు కర్ర చేత్తో పట్టుకుని ఖాసిం చాచా తడిక దగ్గర నిలబడ్డాడు. యాభై గజాల స్థలంలో కట్టుకున్న పెంకుటిల్లు. దానికి చుట్టూ ఉన్న స్థలంలో కూరగాయ మొక్కలు పెంచటం కోసం తడికల్తో దడిలా కట్టి దానికో తడికని తలుపులా అడ్డం పెట్టుకున్నాడు.

కుల్సుం ఖాలా అతని దెబ్బలకు తాళలేక బైటికి వెళ్ళిపోవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుగా నిలబడ్డాడనుకున్నా. ఇంతలో అతని కాళ్ళ పక్కనించి మేకపిల్ల బైటికొచ్చింది. "చావవే ముండా " అంటూ కర్రని బలంగా విసిరాడు ఖాసించాచా. ఆ దెబ్బకు మేక హృదయ విదారకంగా అరిచి కొన్ని క్షణాలు కూలబడి మరలాలేచి ప్రాణ భయంతో నా యింట్లోకి పరుగెత్తుకుంటూ వచ్చింది. దాని వెంటే కర్ర

ఎత్తి పట్టుకుని ఖాసించాచా వచ్చాడు.

నా కళ్ళెదురుగా నేను ప్రేమగా పెంచుకుంటున్న మేకపిల్లని కొట్టడం చూసి కోపాన్ని అదుపు చేసుకోలేక పోయాను.

"ఖబడ్దార్ ఖాసించాచా. నాకంటే వయసులో పెద్దవాడివని కూడా చూడను. అసలు నువ్వు మనిషివేనా? నోరు లేని జంతువు. అందునా పసికూన. చచ్చేలా కొట్టడానికి నీకు చేతులెలా వచ్చాయి" అన్నాను కోపంగా.

"చంపాలా నరకాలా... కష్టపడి కాయగూర మొక్కలేసుకుంటే ఇది బతకనివ్వటం లేదు. బీరపాదు... చక్కగా విరగకాసింది. నేడో రేపో పిందెలేస్తుందని మేము సంబర పడుతుంటే ఎట్లా వచ్చిందో మహమ్మారి... ఒక్క ఆకు లేకుండా తినేసింది. ఈ రోజు దాన్ని హలాల్ చేసి మన ఇస్లాంపేటలో అందరికీ తలో అరకేజీ మాంసం పంచిపెడతా" అన్నాడు కోపంగా.

"ఇక్కడ నేనేమీ గాజులు తొడుక్కుని లేను. దాని వంటిమీద చేయి బడిందో తలకాయలు లేచిపోతాయి" నేనూ ఆవేశంగా హూంకరించాను.

నా భార్య లోపలినుంచి వచ్చి బిక్కుబిక్కు మంటున్న మేకపిల్లని పట్టుకుని వలవలా ఏడ్చింది. "దేఖోజీ... ఎలా బెదిరిపోయిందో... బిడ్డ చలి జ్వరమొచ్చినట్లు వణికిపోతోంది. వీళ్ళ చేతులిరిగిపోను. నలుగుర్ని కంటే సరిపోయిందా? ప్రేమలూ మమకారాలు తెలీని ఎదవ మనుషులు" తిట్లు అందుకుంది.

కుల్సుం పిన్ని కూడా బైటికొచ్చి తన మొగుడికి వత్తాసుగా నిలబడింది. "మేమూ పెంచాం మొక్కల్ని అంత కన్నా ప్రేమగా. దాని నోరు పడిపోను. ఒక్క ఆకు మిగలకుండా తినేసింది. ఐనా పిల్లా పీచూ లేని గొడ్రాలివి. నీకేం తెలుస్తుంది ప్రేమంటే"

ఆమె మాటలకు నాభార్య మరిన్ని శోకాలు పెట్టి ఏడ్చింది.

"ఈసారి మా ఇంట్లోకొస్తే దానికి విషం పెట్టి చంపేస్తాను జాగ్రత్త" అన్నాడు ఖాసిం చాచా.

"ఆపని చేయి. నిన్ను జైల్లో పెట్టించకపోతే నా పేరు మేకల మస్తానే కాదు" అన్నాను.

"ఒరేయ్... నేనేమీ వెర్రి వెధవను కాదురా. నా మొక్కలకు విషం పెడ్తా. నీ మేక వచ్చి తినిపోతుంది. చచ్చి వూరుకుంటుంది. అప్పుడు కేసు నామీదికి రాదు"

అతను అన్నంత పనీ చేస్తాడేమోనని క్షణకాలం భయమేసింది.

మేకపిల్ల దగ్గర మోకాళ్ళమీద కూచుని, "వాడు దుర్మార్గుడు. నీకు విషం పెట్టినా పెడ్తాడు. లేదా పట్టుకెళ్ళి మన మటన్ షాపు ఖాజాగాడికి అమ్మేస్తాడు. నువ్వు వాడింటికి మాత్రం వెళ్ళకు. అయినా నీకంత ఆత్రం దేనికి? నా నాష్టా కాగానే ఎప్పటిలా బైటికి పిల్చుకెళ్ళి చెట్ల ఆకులు తెంపి నోటికందించేవాడిని కదా... వాళ్ళు చూడు అమ్మను కూడా ఎంతలేసి మాటలన్నారో" అన్నాను.

అది అర్థమైనట్లు నావైపు, నా భార్య వైపు చూసి మే అని అరిచింది.

"నాష్టా సగంలో వదిలేశావు. మిగిలిన చపాతీ తిని వెళ్ళు" అని బేగం బతిమాలినా తినాలనిపించలేదు. దోటీ కర్ర తీసుకుని, మేకపిల్లని తోలుకుని బైట పడ్డాను. కుల్సుం పిన్ని ఎంత మాటంది! పిల్లలు లేకపోతేనేం... నోరులేని ఈ మేకలే మా పిల్లలు. నా పదోయేట మా నాన్న చచ్చిపోయాడు. అప్పటినుండీ సంసార భారం నామీద పడింది. రెండు మేకల్ని కొని సాకాను. కొన్నాళ్ళకవి పాతిక మేకలైనాయి. ఇస్లాంపేటలో అందరూ నన్ను మేకల మస్తాన్ అని పిలుస్తున్నందుకు గర్వ పడ్డాను. వాటి ద్వారా వచ్చిన ఆదాయంతోనే తమ్ముడు గౌస్‌ని చదివించాను. పెళ్ళి చేసుకున్నాను. తమ్ముడికి పశువుల ఆస్పత్రిలో కాంపౌండర్‌గా నౌకరీ వచ్చింది. వాడి పెళ్ళి చేశాను. వాడికిప్పుడు ముగ్గురు పిల్లలు.

మేకల్ని స్వంత బిడ్డల్లా పెంచటం... మంచి బేరం వస్తే వాటిని అమ్మేయటం... కొంత కాలానికి ఈ వ్యాపారం ఇబ్బందిగా అన్పించి మానేశాను. ఈ మేకపిల్లని మాత్రమే ఉంచుకుని మిగతా వాటిని అమ్మేసి ఆ డబ్బుతో అద్దంకి బస్టాండ్‌లో

పాన్‌డబ్బా తెరిచాను. జీవితం సాఫీగా సాగిపోతోంది. ఎటొచ్చీ ఎదురింటి ఖాసించాచాతోనే ఏదో ఓ గొడవ... ఎంత ముద్దుగా ఉంటుందో నా మేకపిల్ల... కళ్ళలో నిప్పులు పోసుకుంటున్నారు. ఆకులేగా తిందీ... వాళ్ళ ఆస్తులేమైనా కాజేసిందా?

దారిలో తమ్ముడు గౌస్ ఇల్లుంది. అక్కడో పది నిముషాలు కూచుని నా గోడు వెళ్ళబోసుకున్నా. "ఖాసించాచా తన మొక్కలకు విషం పెట్టి మన మేకని చంపేస్తానన్నాడ్రా"

"అంత అమాయకంగా ఉంటే ఎలా భాయ్... మొక్కలకు విషం పెడ్తే అవి చచ్చి ఎండిపోవా" అన్నాడు. అవును కదా అన్పించింది. ప్రాణం కొద్దిగా తేలిక పడింది.

"అయినా ఇప్పుడేస్తున్న రసాయనిక ఎరువులకి, మోతాదు మించిన పురుగు మందులకీ మించిన విషం ఏముంటుంది? కొన్నాళ్ళు పోతే అలాంటి రోజు కూడా వస్తుందేమో?"

"ఎలాంటి రోజు?" భయంగా అడిగాను.

"మొక్కల్ని తిని జంతువులు చచ్చిపోయే రోజు... కూరగాయలు తిని మనుషులు చచ్చిపోయే రోజు" అన్నాడు.

వాడి మాటల్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ ఆకులు పుష్కలంగా ఉన్న చెట్లను వెతుక్కుంటూ బయల్దేరా. ఒకప్పుడు నా దగ్గర పాతిక మేకలున్నా వాటికి ఆహారం పెద్ద సమస్యలా ఉండేది కాదు. మా యింటికి వంద గజాల దూరంలోనే చెట్లుండేవి.

గత ఐదారేళ్ళ కాలంలో బాగా మార్పొచ్చింది. ఇస్లాంపేటలో ఉండే యాభై గడపలు ఇప్పుడు ఐదొందలలైనాయి. చెట్లని కొట్టేసి, భూమిని చదును చేసి, ఇళ్ళ స్థలాలుగా అమ్ముకున్నారు. గత ఏడాది మైలు దూరం నడిస్తే కన్పించిన చెట్లు... ఈ రోజు రెండు మైళ్ళు నడిస్తేగాని కళ్ళకు కానరావటం లేదు.

పోతురాజు కాలువ పక్కన ఉన్న చెట్ల దగ్గర ఆగి దోటీ కర్రతో ఆకుల్ని తెంపి

మేక ముందరేశాను. అది కడుపు నిండా తిన్నాక మరికొన్ని కొమ్మల్ని తెంపి ఇంటి ముఖం పట్టాను. అప్పటికే సమయం ఎనిమిది కావస్తోంది. ఎనిమిదన్నరకల్లా పాన్ డబ్బా తెరవాలి.

"జత్తన్ బేగం. ఖాసించాచా వాళ్ళింట్లోపలికి వెళ్ళకుండా కట్టేసి పెట్టు" అన్నాను.

"నీకే కాదు. నాకూ అదంటే ప్రాణమే. కళ్ళల్లో పెట్టుకుని కాపాడుకుంటా. నువ్వు బేఫికర్‌గా ఉండు" అంది నా భార్య.

చెప్పినట్లే దాన్ని భద్రంగా కాపాడింది. మా బుజ్జి మేక ఇప్పుడు పెద్దదయింది. కడుపుతో ఉంది. నాకలలకు రెక్కలొచ్చాయి. దీనికి మూడో నాలుగో బుజ్జి మేకలు పుడ్తాయి. అవీ పెద్దయినాక వాటికీ పిల్లలు పుడ్తాయి. నా ఇల్లంతా మేకల్తో నిండి పోయి సందడిగా ఉంటుంది.

"ఈరోజు ఆదివారం. మాంసం తినాలని ఉందన్నావుగా. తొందరగా వెళ్ళిరా. లేకపోతే ఆ ఖాజా మిగులూ బుగులూ అంటగడ్తాడు" అంది బేగం.

దార్లో గౌస్‌ని కదిపా. తనకూ కిలో మాంసం కావాలన్నాడు. ఇద్దరం పిచ్చాపాటి మాట్లాడుకుంటూ మాంసం దుకాణానికెళ్ళాం.

"మస్తాన్ భాయ్. కిలోనా రెండు కిలోలా" అని అడిగాడు ఖాజా.

"పరాచికాలెందుకు ఖాజా భాయ్. ఉన్నది ఇద్దరం... నేనూ మీ భాభీ... అరకిలో చాలు" అన్నాను.

వేలాడుతున్న తొడభాగంలోంచి ఓ ముక్కని కోసి, చిన్న ముక్కలుగా కొట్టి, తూకం వేసి నల్లటి ప్లాస్టిక్ సంచీలో వేసిచ్చాడు.

"ఈ ప్లాస్టిక్ సంచీలెప్పటినుండి షురూ చేశావ్ ఖాజా భాయ్? పోయినాదివారం కూడా ఎప్పటిలా బాదం ఆకుల్లో కదా పొట్లం కట్టిచ్చావు" అన్నాను.

"ఇప్పుడందరూ ఇవే వాడుతున్నారు. మన కిరాణాకొట్టు వలీ కూడా సరుకుల్ని ప్లాస్టిక్ సంచీల్లో వేసిస్తున్నాడు. పట్టుకెళ్ళటం సులభం కదా" అన్నాడు ఖాజా.

"ఔనౌను. మొన్న అరకేజీ కంది పప్పు కొనడానికెళ్ళా. ఒకప్పుడు కాగితం సంచిలో వేసిచ్చేవాడు ఆరోజు ఇలాంటి ప్లాస్టిక్ దాంట్లో వేసిచ్చాడు" అన్నాను.

"అందరూ ఈ సంచులు సౌకర్యంగా ఉన్నాయంటున్నారు. అందుకే ఏడాదికి సరిపడా కొనిపెట్టుకున్నా. హోల్‌సేల్‌గా కొంటే తక్కువకొస్తాయిగా మస్తాన్ భాయ్" అన్నాడు.

గౌస్ కలుగ జేసుకుని, " ఇలాంటి ప్లాస్టిక్ సంచులు ఆరోగ్యానికి మంచివి కావని మా వెటర్నరీ డాక్టర్ అంటుంటే విన్నాను" అన్నాడు.

"ఎందుకట" ఖాజా అడక్కముందే నేనడిగాను.

"వీటిలో క్యాన్సర్‌ని కలుగజేసే రసాయనాలేవో ఉంటాయట. ఈ మధ్య హోటళ్ళలో కూడా వీటినే క్యారీ బ్యాగులుగా వాడ్తున్నారు. అదింకా ప్రమాదకరమట. ఆహారపదార్థాల వేడికి ఆ రసాయనాలు తొందరగా కరిగి, మనం తిన్నాక శరీరంలోపలికెళ్ళి హాని చేస్తాయట."

మాంసం కొనడానికొచ్చేవాళ్ళు విని కంగారు పడ్తారనుకున్నాడో ఏమో, "అయన్నీ ఉత్తుత్తి భయాలు గౌస్ భాయ్. చెప్పేవాళ్ళు చెప్తూనే ఉంటారు వాడే వాళ్ళు వాడ్తూనే ఉంటారు. సెల్‌ఫోన్లు వాడితే క్యాన్సర్ వస్తుందని ఆ మధ్య ఎప్పుడో పేపర్లో రాశారటగా. కానీ వాడకుండా వదిలేశామా... నాకు మావాడు సెల్ కొనిచ్చాడు. ఇదుగో" అంటూ చూపించాడు.

"ఏదైనా మితంగా వాడితే నష్టం మరీ ఎక్కువుండదు" అన్నాడు గౌస్.

"మన చేతుల్లో ఏముంది? అల్లా దయగా చూడాలిగానీ లేకపోతే ప్రమాదం ఎందులో లేదు? మనం పీల్చే గాలి శుభ్రంగా ఉందా తాగేనీరు శుభ్రంగా ఉందా? చావు రాసి పెట్టి ఉంటే ఎల్లా ఉన్నా వస్తుంది" వేదాంత ధోరణిలో అన్నాడు ఖాజా.

దారిలో గౌస్ మరికొన్ని విషయాలు చెప్పాడు. "మనం వాడి పడేసిన పేపర్లూ, తినే పదార్థాలూ, ఆకులూ అలములూ అన్నీ మట్టిలో కలిసిపోతాయి. కానీ ఈ

ప్లాస్టిక్ మాత్రం మట్టిలో కలవదు. నువ్వు గమనించావోలేదో మన ఇస్లాంపేటలో వీధుల పక్కనా, చెత్తకుప్పల్లో ఈ సంచులు కన్పించటం ఎక్కువైపోయింది."

"ఔను. గాలికి నల్లటి, తెల్లటి సంచులు ఎగురుతూనో, మట్టిలో సగం కప్పబడి రెపరెపలాడుతూనో కన్పిస్తున్నాయి"

"అవసరం ఉన్నా లేకున్నా వీటి వాడకం ఎక్కువైంది. మనిషి తన సౌలభ్యాన్ని చూసుకుంటున్నాడు తప్ప దాని వల్ల జరిగే నష్టం గురించి ఆలోచించడంలేదు. మన ఖాజానే చూడు. విస్తరాకుల్లోనో బాదం ఆకుల్లోనో మాంసం కట్టిచ్చేవాడు కాస్తా ప్లాస్టిక్ సంచుల్లోకి దిగాడు. పోటీ... ఒకర్ని చూసి మరొకరు వాతలు పెట్టుకుంటున్నారు"

"ఔన్రా. మొన్న మందుల దుకాణానికెళ్ళి ఒక అమృతాంజన్ సీసా, తలనొప్పికని ఆరు క్రోసిన్ బిళ్ళలు కొన్నాను. వాటిని కూడా ఇలాంటి నల్లటి ప్లాస్టిక్ సంచిలో వేసిచ్చాడు. అవి చేతిలో పట్టుకున్నా సరిపోతాయి లేదా జేబులో వేసుకున్నా సరిపోతాయి."

మధ్యాహ్నం భోజనాలయ్యాక ఓ కునుకు తీశాను. నా పేరు పెట్టి పెద్దగా ఎవరో పిలుస్తుంటే మెలకువొచ్చింది. తీరా చూస్తే బీరప్ప. మేకల్ని గొర్రెల్ని పెంచటమే జీవనోపాధిగా బతికే కులస్థుడు.

"ఏంటి బీరప్పా... ఎండన పడి వచ్చావు" అన్నాను.

"ఇనగూడని ఇసయమేదో ఇని లగెత్తుకుంటా వచ్చినా. మన గౌసన్న ఉన్నాడుగా. అడిగి తెల్సుకుందామని ..."

"ఏమిటా విషయం?"

"మన పెబుత్వం మేకల్ని సంపేయాలని రూలు తీసిందటగా. ఎవురో నా సెవిన ఏస్తే బేజారెత్తి వచ్చినా. అలాగైతే మా కులపోల్ల బతుకులో బుగ్గి పడదా... మా నోల్లలో మన్ను పడదా" అన్నాడు.

ఆ విషయం విని నేనూ కంగారుపడ్డాను. మేకల్ని చంపడం ఏమిటి?

ఎంతన్యాయం? అవేం పాపం చేసినాయని... అవేం నేరం చేసినాయని...

"ఛ... నిజమై ఉండదు బీరప్పా. పుకారై ఉంటుంది. అయినా మేకల్ని చంపటం తప్ప గవుర్నమెంటోడికి మరో పని లేదా ఏమిటి?" అన్నాను.

ఎందుకయినా మంచిదని ఇద్దరం వెళ్ళి గౌస్‌ని సంప్రదించాం. తనకూ తెలీదన్నాడు. మరునాడు వాళ్ళ డాక్టర్నడిగి చెప్తానన్నాడు.

నాకు నా మేకని తల్చుకుని దిగులేసింది. అసలే సూడిది... ఖాసిం చాచా నుంచి ఎలాగోలా కాపాడుకుంటూ వస్తుంటే ఇప్పుడు ప్రభుత్వం నుంచి కూడా కాపాడుకోవాలా... అదెలా సాధ్యం... ఫ్రభుత్వంతో నేను పోరాడగలనా...

మరునాడు గౌస్ ఆస్పత్రి నుంచి రాకముందే టీవీల్లో వార్త వచ్చింది. మేకల వల్ల మొక్కలూ, చెట్లు అంతరించిపోయే ప్రమాదం ఉంది కాబట్టి మేకల్ని చంపేయాలని ప్రభుత్వం యోచిస్తోందట. నేనూ బీరప్పా కలిసి రాత్రి ఎనిమిదింటికి గౌస్ దగ్గరకెళ్ళాం.

"ఇదేం అన్యాయంరా... కలికాలం కాకపోతే నోరులేని మేకల్ని చంపడం ఏమిట్రా... గవుర్నమెంటోడికి అవేం అడ్డం... వాటి మానాన అవి బతుకుతున్నాయిగా" అన్నాను.

"చెట్ల ఆకులు తగ్గిపోవటం వల్ల మనుషులకు ప్రాణాధారమైన ఆక్సిజన్ తయారు చేయటం మందగిస్తుందని వాళ్ళ వాదన. అందుకే మేకల్ని అసలుకే లేకుండా నాశనం చేస్తే పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని మంత్రిగారి అభిప్రాయం"

"మాలాంటోల్ల గతేంటి గౌసన్నా" బీరప్ప దిగాలుగా అడిగాడు.

"మీకోసం ఏదైనా ప్రత్యామ్నాయం చూస్తామని హామీ ఇచ్చారుగా"

"నిజంగానే మా మేకల్ని సంపేత్తారా?" బీరప్ప కళ్ళలో భయం..

"ప్రభుత్వం తల్చుకుంటే దానికెదురేముంది? యేడాది క్రితం బర్డ్ ఫ్లూ అనే కోళ్ళతెగులొచ్చినపుడు వేలకు వేల కోళ్ళను చంపి గుంటలు తవ్వి పాతి పెట్టారు

గుర్తుందా"

"గొర్రెల్ని కూడా సంపేత్తారా?"

"లేదు. వాటిని మినహాయించారు. మేకలు తమ ముందు కాళ్ళని ఎత్తి ఎత్తుగా ఉన్న కొమ్మల్ని కూడా అందుకుని వాటి ఆకుల్ని తింటాయి కదా. గొర్రెలైతే తలలు ఎత్తవు. వొంచుకునే నడుస్తాయి. కాబట్టి రాలిన ఆకుల్నే తింటాయి. అందువల్ల పర్యావరణానికి నష్టమేమీ లేదని మంత్రి గారే చెప్పారు"

"ఎంత మూర్ఖంగా ఉందిరా... మన మేకైనా చెట్లని ఎక్కి ఆకులు తింటుందా ఏమిటి? దానికి అందకపోతే పొడవాటి దోటీ కర్రతో నేను కొమ్మల్ని తెంపి వేయటం లేదా... గొర్రెలకూ అంతే" అన్నాను.

అంత విషాదంలోనూ బీరప్పకు నవ్వొచ్చింది. "నేను గాసే గొర్రెలకే బుర్రుండదనుకున్నా. మంతిరికి కూడా ఉండదని ఇప్పుడే తెల్సిందన్నా"

"నిజమే. మా డాక్టర్ గారు అంటుంటే విన్నాను. ఒక కారు రోడ్డు మీద ఒక గంట ప్రయాణం చేస్తే ఇద్దరు మనుషులకు అవసరమైన ఆక్సిజన్ని హరిస్తుందట. మన ఒంగోల్లో విపరీతంగా కార్లు పెరిగిపోయాయి. బ్యాంకులవాళ్ళు పిలిచి మరీ అప్పులిస్తున్నారు. చిన్న చిన్న ఉద్యోగస్థులు కూడా ఒకప్పుడు సైకిళ్ళు కొన్నట్లు ఇప్పుడు కార్లు కొంటానికి ఎగబడ్తున్నారు. వీటిని ప్రభుత్వం నియంత్రించదు. కార్లకు సరిపడా కావాలంటే రోడ్లని వెడల్పు చేస్తుంది. అంతే. అది వ్యాపారం. దాని వల్ల పర్యావరణానికి ఎంత హాని జరిగినా వీళ్ళకు పట్టదు" అన్నాడు గౌస్.

"పచ్చని చెట్లని నరికేసి ఇళ్ళు కట్టుకుంటున్నారు. పంట పొలాల్ని స్థలాలుగా మార్చి అమ్ముకుంటున్నారు. వీటి గురించి ఆలోచించకుండా మేకల్ని చంపుతానంటారేమిటి?ఆడలేక మద్దెల ఓడు అన్న సామెతలా ఉంది" అన్నాను.

ఆ రాత్రి నాకు అన్నం సయించలేదు. నిద్ర పట్టలేదు. పీడ కలలు... కలవరింతలు...

నా కూతుర్ని లాక్కుపోతున్నారు. తలారి పెద్ద కత్తి పట్టుకుని వధ్యశిల దగ్గర నిలబడి ఉన్నాడు. నా కూతురు గింజుకుంటోంది. “అయ్యా... బాబూ... దాన్ని వదిలేయండి. అది వట్టి మనిషి కూడా కాదు. తొలి చూలు. దయచూపండి” అని కాళ్ళు పట్టుకుంటున్నా. నా భార్య ఏకధాటిగా ఏడుస్తోంది. “మేరీ బేటీ... నాదాన్ బేటీ... మై పావ్ పడ్తీ సాబ్... ఛోడ్‌దో” అంటోంది. అయినా కనికరం చూపలేదు. తలను ఒక్క వేటుతో నరికేశారు. తల ఒక వైపు... మొండెమొక వైపు... కడుపులో పిండం??? పిచ్చిగా వెతుక్కుంటున్నా... అరుస్తున్నా... రోదిస్తున్నా...

మెలకువొచ్చింది. వళ్ళంతా పెనంలా కాలిపోతోంది. జ్వరం... నాలుగు రోజులు సతాయించిగానీ తగ్గలేదు.

మంత్రిగారి అభిప్రాయంతో ప్రతిపక్షాలవాళ్ళు ఏకీభవించలేదు. మేకల్ని కాసే వందలాది కుటుంబాలు తమ నిరసన తెలియచేసాయి. ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ఆత్మాహుతికి సిద్ధపడ్డారు. పర్యావరణ మంత్రి గారు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోక తప్పలేదు.

నేను హాయిగా వూపిరి పీల్చుకున్నా. ఆ రోజే గౌస్‌కి చెప్పి మేకని పశువుల డాక్టర్‌కి చూపించా. చాలా ఆరోగ్యంగా ఉందనీ, నాలుగు పిల్లలు పుట్టే అవకాశముందనీ చెప్పాడు. కాన్పు వారంలోపలే అవుతుందని కూడా చెప్పాడు. నా ఆనందానికి అవధుల్లేవు. రోజులు లెక్క పెట్టుకుంటున్నా. ఒకరోజు... రెండు రోజులు.... మూడు రోజులు...

నాలుగో రోజు మేక గిలగిలా కొట్టుకుంటూ పడిపోయింది. కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందేమోనని భయపడ్డాం. రిక్షాలో వేసుకుని పశువుల ఆస్పత్రికి పిల్చుకెళ్ళా. మేక కళ్ళు తేలేస్తోంది. నోట్లోంచి నురగలు వస్తున్నాయి.

అప్పుడొచ్చింది అనుమానం... ఖాసిం చాచా విషం పెట్టాడా అని... గౌస్‌తో నా అనుమానం చెప్పాను. డాక్టర్ రెండు ఇంజక్షన్లు చేశాడు. అయినా పరిస్థితిలో మార్పులేదు.

“నాకు తెలుసు. ఇది వాడి పనే. ముసలి నక్క. నా మేకకు విషం పెట్టాడు” అంటూ భోరుమని ఏడ్చాను. “డాక్టర్! నా మేకని కాపాడండి. అది వట్టిది కూడా కాదు. తొలి చూలు. మీ కాళ్ళు పట్టుకుంటాను డాక్టర్”

“డాక్టర్ గారికి తెలియదా... నువ్వేడ్వకు భాయి” అన్నాడు గౌస్.

దాన్ని రక్షించడానికి డాక్టర్ చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయ్యాయి. నేనెంతో ప్రేమగా పెంచుకున్న నా మేక చచ్చిపోయింది.

“డాక్టర్! నిజం చెప్పండి. విషమే కదూ” ఖాసిం చాచాని తల్చుకుని పళ్ళు పటపట కొరుకుతూ అడిగా.

“విషమే”

“నేను చెప్పలేదా... వాడే విషం పెట్టాడు. వాణ్ణి చంపేస్తా” అన్నాను గౌస్‌తో.

“ఎంత మందినని చంపుతావు? విషమే... ప్లాస్టిక్ విషం. మేక ప్లాస్టిక్ సంచుల్ని తినేసింది. వాటి వల్లనే చచ్చి పోయింది. సముద్రంలోని పెద్ద పెద్ద తిమింగలాలే ప్లాస్టిక్ వస్తువులు మింగటం వల్ల చనిపోతున్నాయట. మేక చావటంలో ఆశ్చర్యమేముంది?” అన్నాడు డాక్టర్.

“ప్లాస్టిక్ విషమా? యా అల్లా” అంటూ కుప్పలా కూలిపోయా.

**(ఆంధ్రజ్యోతి, ఆదివారం. 22 జులై 2007)**

★ ★ ★